'బండి'కి పట్టం

- మోదీ మంత్రి వర్గంలో స్థానం
- బీజేపీలో అంచలంచెలుగా ఎదిగిన సంజయ్
- సొంత పార్టీలోనే అణచివేసే కుట్రలు
- అన్నింటినీ తట్టుకొని నేడు కేంద్ర మంత్రి వరకు..

అత్యంత కీలకమైన కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి రెండుసార్లు విజయం సాధించిన బండి సంజయ్‌కు ఆ పార్టీ పెద్దపీట వేసింది. అందరి అంచనాలకు అనుగుణంగానే.. ఆయనకు కేంద్ర మంత్రి పదవుల్లో చోటు దక్కింది. సొంత పార్టీలోనే అతన్ని అణచివేసేందుకు కుట్రలు కుతంత్రాలు జరిగినా.. వాటిన్నింటినీ దాటేస్తూ.. అంచలంచెలుగా పార్టీలో ఎదుగుతూ వచ్చారు. చిన్నప్పుడే రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్‌లో సేవకుడిగా పనిచేసిన ఆయన, ఆ తదుపరి విద్యార్థి సంఘం నాయకుడిగా.. అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా, కార్పొరేటర్‌గా.. పార్లమెంట్ సభ్యుడిగా అనేక విజయాలు సాధించి.. నేడు కేంద్ర మంత్రి హోదా దక్కించుకున్నారు.

-కరీంనగర్, జూన్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

బండి సంజయ్ బీజేపీలో అంచలంచెలుగా ఎదిగారు. సొంత పార్టీలోనే అతన్ని అణచివేసేందుకు అనేక కుట్రలు, కుతంత్రాలు జరిగాయి. చాలా విమర్శలు సైతం చేశారు. రాష్ట్రంలోనే కాదు.. సొంత జిల్లాలో సొంత పార్టీ నుంచే అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్టీ నుంచి, అలాగే క్షేత్రస్థాయిలో ఎదురైన ప్రతి అడ్డంకిని అధిగమించి.. పార్టీలో తన కంటూ ఒక స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. పార్టీ పదవులు కాకుండా.. అతని రాజకీయ జీవితం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నుంచి ప్రారంభమైంది. అక్కడి నుంచి కార్పొరేటర్‌గా ప్రస్థానం సాగించి.. ఆ తదుపరి రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా కరీంనగర్ నుంచి విజయం సాధించి.. నేడు కేంద్ర మంత్రిలో చోటు దక్కించుకున్నారు. కరీంనగర్ లోక్ సభ నుంచి ఎంపీగా విజయం సాధించి కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న వారిలో బండి సంజయ్ మూడో వ్యక్తి. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 1999లో విజయం సాధించిన సీహెచ్ విద్యాసాగర్‌రావు ఆనాటి ఎన్‌డీఏ ప్రభుత్వంలో హోంశాఖ సహాయ మంత్రిగా పని చేశారు. అలాగే, ఈ నియోజకవర్గం నుంచే ఎంపీగా విజయం సాధించిన తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 2004-2006 వరకు కేంద్ర ప్రభుత్వంలో కేంద్ర కార్మిక-ఉపాధి మంత్రిత్వ శాఖ, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖలకు కేబినెట్ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత మళ్లీ బండి సంజయ్ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. కరీంనగర్ శాసనసభ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన సంజయ్.. ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచి.. తన పట్టు నిరూపించుకున్నారు.

రాష్ట్ర ప్రగతి కోసం పనిచేస్తా

నాపై నమ్మకం ఉంచి కేంద్ర మంత్రి వర్గంలో చోటు కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, జాతీయ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. కార్యకర్తల కృషి ఫలితమే ఈ మంత్రి పదవి. ముఖ్యంగా నాపై నమ్మకం ఉంచి రెండోసారి భారీ మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల వల్లే ఈరోజు కేంద్ర మంత్రిగా పని చేసే వచ్చింది. మంత్రిగా వచ్చిన అవకాశాన్ని రాష్ట్ర ప్రగతి కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం వినియోగిస్తా. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నేను కోరేదొక్కటే. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. వ్యక్తిగత ఆరోపణలు, విమర్శలను పక్కనపెట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలి. కేంద్ర మంత్రిగా రాష్ట్రాభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నా. తెలంగాణ ప్రజలు బీజేపీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.

-బండి సంజయ్, కేంద్ర మంత్రి

బండి సంజయ్ వ్యక్తిగత ప్రొఫైల్

పేరు: బండి సంజయ్ కుమార్, **పుట్టిన తేదీ:** 11-7-1971
తల్లిదండ్రులు: (కీ.శే. బండి నర్సయ్య) - శకుంతల
కులం: మున్నూరుకాపు (బీసీ-డీ), **భార్య:** బండి అపర్ణ (ఎస్‌బీఐ ఉద్యోగిని)
పిల్లలు: సాయి భగీరత్, సాయి సుముఖ్
ప్రస్తుత బాధ్యతలు: కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి
గతంలో చేపట్టిన బాధ్యతలు:

- బాల్యం నుంచే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో స్వయం సేవకుడిగా..
- అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌లో పట్టణ కన్వీనర్, పట్టణ ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా..
- దీ కరీంనగర్ కో-ఓపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో రెండు పర్యాయాలు (1994-1999, 1999-2003) డైరెక్టర్‌గా..
- బీజేపీ జాతీయ కార్యాలయం, ఢిల్లీలో ఎన్నికల ప్రచార ఇన్‌చార్జిగా..
- భారతీయ జనతా యువ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి, పట్టణ అధ్యక్షుడిగా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, జాతీయ కార్యదర్శిగా సేవలందిస్తూ కేరళ, తమిళనాడు ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు.
- ఎల్‌కే అద్వానీ చేపట్టిన సురాజ్ రథ యాత్రలో వెహికల్ ఇన్‌చార్జిగా పనిచేశారు.
- కరీంనగర్ నగర పాలక సంస్థగా ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిగా 48వ డివిజన్ నుంచి బీజేపీ కార్పొరేటర్‌గా రెండు సార్లు విజయం సాధించారు.
- వరుసగా రెండు పర్యాయాలు నగర బీజేపీ అధ్యక్షుడిగా.
- 2014 సాధారణ ఎన్నికల్లో కరీంనగర్ శాసనసభ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి, 52,000 వేల పైచిలుకు ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు.
- 2016లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు.
- 2019 ఎన్నికల్లో తిరిగి బీజేపీ తరపున కరీంనగర్ శాసనసభ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి 66,009 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు.
- 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి 96 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు.
- 2019 ఓబీసీ వెల్ఫేర్ పార్లమెంట్ కమిటీ మెంబర్‌గా నియామకమయ్యారు. (ఇంకా కొనసాగుతున్నారు)
- 2019 అర్బన్ డెవలప్‌మెంట్ పార్లమెంట్ కమిటీ మెంబర్‌గా నియామకం (ఇంకా కొనసాగుతున్నారు) 2019 టొబాకో బోర్డు మెంబర్‌గా నియామకం
- 2019 మైనారిటీ అఫైర్స్ స్టేట్ లెవెల్ కమిటీ మెంబర్‌గా నియామకం.
- 2020 ఎయిమ్స్ బీబీనగర్ బోర్డు మెంబర్‌గా నియామకం, (ఇంకా కొనసాగుతున్నారు)
- 2020 మార్చి 11 నుంచి 2023 జూలై 3 వరకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. 2023 జూలై 8న జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియామకం.
- 2023 జూలై 29న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం.
- 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి, 89016 ఓట్లు సాధించి 3163 ఓట్ల తేడాతో ఓటమి.
- 2024 మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి 5,85,116 ఓట్లు సాధించి, 2,25,209 మెజారిటీతో రెండోసారి ఎంపీగా విజయం.

గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశాంతం

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 29,151 మంది అభ్యర్థుల హాజరు • 8001 మంది గైర్హాజరు
- నిమిషం నిబంధనతో పలువురికి నో ఎంట్రీ

అభ్యర్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలిస్తున్న నోడల్ అధికారి ప్రపుల్ దేశాయ్

కలెక్టరేట్, జూన్ 9 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 87 సెంటర్లలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. మొత్తం 37,152 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 29,151 మాత్రమే హాజరైనట్లు యంత్రాంగం పేర్కొంది. కరీంనగర్ జిల్లాలో 18,663 మందికి 14,577 మంది, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4,699 మందికి 3,780, పెద్దపల్లి జిల్లాలో 6,098 మందికి 4,737 మంది, జగిత్యాలలో 7,692 మందికి 6,057 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. కాగా, నిమిషం నిబంధన పలువురి ఆశలపై నీళ్లు చల్లింది. అధికారులు లోనికి అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరుగడం కనిపించింది.

తిమ్మాపూర్ : వాగేశ్వరిలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

వీర్నపల్లిలో వీరగల్లు శిల్పాలు

వీర్నపల్లిలో బయటపడ్డ వీరగల్లుల శిల్పాలు

- నాటి యుద్ధవీరులు.. గ్రామ రక్షకులు

వీర్నపల్లి, జూన్ 9: వీర్నపల్లి మండల కేంద్రంలో పెద్దవాగు శివారులో ఆదివారం ఆరు వీరగల్లుల శిల్పాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విగ్రహాల ఎడమ చేతిలో విల్లు, బాణం, కుడిచేతిలో కత్తి, కొప్పు, ఈటె పట్టుకొని శత్రువుతో యుద్ధంచేస్తున్నట్లు, వీరస్వర్గం పొందినట్లు చెక్కబడి ఉంది. నాటి కాలంలో పశువులను క్రూర జంతువుల నుంచి రక్షించేందుకు, గ్రామాల్లో దొంగతనాలు జరుగుకుండా కాపలాఉండేందుకు, వానాకాలంలో చెరువులకు గండిపడిన సమయంలో గ్రామాలను రక్షించేందుకు ధైర్యం కలిగిన వ్యక్తులను యుద్ధవీరులుగా నియమించేవారని తమ పూర్వీకులు చెబుతుంటే విన్నామని గ్రామస్తులు చెప్పారు. అలనాటి సాహస వీరులకు గుర్తుగా వీరగల్లులు శిల్పాలు అక్కడక్కడా కనిపిస్తుంటాయన్నారు. కాగా, శిల్పాలపై వీరగల్లుల ప్రతిరూపాలు బయటపడడంతో నాటి వీరులపల్లి, కాలక్రమేణా వీర్నపల్లిగా మారిందని గ్రామంలో చర్చించుకుంటున్నారు.

న్యాయం చేయండి

- వేంనూరులో భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

పాలకుర్తి, జూన్ 9: భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని చంటిబిడ్డతో భర్త ఇంటి ఎదుట ఓ భార్య ఆందోళనకు దిగింది. పాలకుర్తి మండలం వేంనూరులో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలకేంద్రానికి చెందిన ముల్కాల ప్రమీల వేంనూర్‌కు చెందిన బట్టు విద్యాసాగర్ 2012 నుంచి ప్రేమించుకుని 2018లో బెల్లంపల్లి శివాలయం లో వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల కూతురు రిన్సి ఉంది. అయితే, కొంతకాలంగా విద్యాసాగర్ తనను కాపురానికి తీసుకువెళ్లడంలేదని, తనకు న్యాయం చేయాలని భర్త ఇంటిఎదుట ఆదివారం చంటిబిడ్డతో కలిసి ఆందోళనకు దిగింది. తన భర్త తప్పించుకుని హైదరాబాద్‌కు పారిపోయి తనకు అన్యాయం చేస్తున్నాడని వాపోయింది. వేంనూర్‌లో అత్త, బంధువులు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త ఇంటి ఎదుట భార్య నిరసన విషయం తెలుసుకున్న బసంత్‌నగర్ పోలీసులు వేంనూర్ చేరుకుని ఇరువర్గాలతో చర్చిస్తున్నారు.

న్యాయవాదుల సంఘాల ఫెడరేషన్ వర్కింగ్

- ప్రెసిడెంట్‌గా రాజ్‌కుమార్

కోర్టు చౌరస్తా, జూన్ 9 : తెలంగాణ న్యాయవాదుల సంఘాల ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్ నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఇందులో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్ కుమార్‌ను, రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండాల్‌రెడ్డిని ఫెడరేషన్ అధ్యక్షుడిగా, నాంపల్లి క్రిమినల్ కోర్ట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు రాజ్‌కుమార్ తెలిపారు. రాజ్‌కుమార్ ఎన్నికపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు.

పీవీ రాజ్‌కుమార్

కోతుల ఈత సరదా

మధ్యాహ్నం వేల వేడి నుంచి ఉపశమనం పొందేందుకు కోతులు ఇలా ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నాయి. మల్లాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన దగ్గర గల ఓ పశువుల నీటి తొట్టిలో ఈత కొడుతూ సందడి చేశాయి. ఈ దృశ్యాన్ని 'నమస్తే' తన కెమెరాలో బంధించింది.

-మల్లాపూర్, జూన్ 9

పశువుల నీటి తొట్టిలో ఈత కొడుతున్న వానరాలు

విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

ఐఐటీ-జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో

అల్ఫోర్స్ విజయభేరి

- జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు
- విద్యార్థులను అభినందించిన విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూన్ 9: ఐఐటీ-జేఈఈ అడ్వాన్స్‌డ్-24 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో విజయభేరి మోగించారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ టైనిటాన్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక ప్రణాళిక, అధ్యాపకుల అవిశ్రాంత పాఠ్యబోధన, విద్యార్థుల కృషితోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయన్నారు. ప్రతి సంవత్సరం అల్ఫోర్స్ అందిస్తున్న శిక్షణ ద్వారా ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీట్లు సాదించే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగా ఆదివారం వెలువడ్డ ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఇందులో ఎం హర్షిత్ 64వ ర్యాంకు సాధించగా, జీ శ్రీహాస్ 290, బీ భరద్వాజ్ 396, ఆర్ పునీత్ మనోహర్ 477, సుబోద్ దరి 545, ఏ శివవరుణ్ 557, పీ రాహుల్ 571, దేవదత్త 751, విశాల్ రెడ్డి 838, డీ రిశ్వంత్ కుమార్ 1029, పీ మనోహర్ 1229, నిహాల్ 1379, ఆదిత్య వర్ధన్ రావు 1523, లహరి 1609, అరుణ్ కుమార్ 1658, బీ అభినవ్ సిద్దార్థ రెడ్డి 1851, సత్య అమూల్య 1933 ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని మరింత పెంచారని చెప్పారు. అలాగే వెయ్యి లోపు తొమ్మిది మంది విద్యార్థులు, 2000 లోపు 17 మంది, 5000 లోపు 32 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వారిని అభినందించి సత్కరించారు.

అందరి ప్రోత్సాహంతోనే ఉత్తమ ర్యాంకు

నాకు ఆల్ ఇండియా 64 వ ర్యాంక్ రావడానికి సహకరించిన అల్ఫోర్స్ విద్యాసంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు. నరేందర్ రెడ్డి సార్ ప్రతి సారి మాకు ఇచ్చే శిక్షణ, మాక్ పరీక్షల విషయంలో ప్రతి సారి అధ్యాపకులను ప్రోత్సహిస్తూ, పరిశీలించారు. పరీక్షలు రాసే సమయంలో కూడా ఎక్కడ మార్కులు తగ్గుతున్నాయి..? ఏ ప్రశ్నలు ఎలా గుర్తించాలనే..? విషయంపై చాలా అవగాహన కల్పించారు. అందరి ప్రోత్సాహంతోనే నాకు మంచి ర్యాంకు వచ్చింది.

- హర్షిత్, 64వ ర్యాంకు, అల్ఫోర్స్

నేటి నుంచి పీజీ సెట్ అర్హత పరీక్షలు

కమాన్‌చౌరస్తా, జూన్ 9 : శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ - 2024 (టీజీ పీఈసెట్ -2024) అర్హత పరీక్షలు ఈనెల 10న ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభమవుతాయని కన్వీనర్ ఆచార్య రాజేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ప్రారంభమయ్యే పరీక్షల నిర్వహణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల ఆచార్యులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన కోచ్‌లు, పరీక్షల నిర్వహణాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. పురుష అభ్యర్థులకు 100 మీటర్లు, 800 మీటర్లు, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్, ఒక విభాగంలో నైపుణ్య పరీక్షను, మహిళా అభ్యర్థులకు 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్, ఒక విభాగంలో నైపుణ్య పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. 13వ తేదీ వరకు ఈ పరీక్షలు ఉంటాయని, ప్రతిరోజూ సుమారు 600 మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు.

కాలువలు ఇలా.. నీరందేది ఎలా..?

- పెగడపల్లిలో అధ్వానంగా ఎస్సారెస్పీ కెనాళ్లు
- పూడికతో నిండి, పలుచోట్ల కూలిపోయి ఆనవాళ్లు కోల్పోయిన వైనం
- వెంటనే మరమ్మతులు చేయాలని రైతుల విజ్ఞప్తి

పెగడపల్లిలో పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న ఎస్సారెస్పీ డీ-76, 77 ప్రధాన కాలువ

పెగడపల్లి, జూన్ 9: ఎస్సారెస్పీ కాలువలు అధ్వానంగా మారాయి. దశాబ్దాలుగా రైతన్నకు ఆదరువుగా మారి, సాగుకు భరోసా ఇచ్చిన కెనాళ్లు ప్రస్తుతం పూడికతో నిండి, ఈత, తాటి, తుమ్మ, పిచ్చి చెట్లు పెరిగిపోయి ఆనవాళ్లు కోల్పోయాయి. ప్రధానంగా పెగడపల్లి మండలంలోని డీ-76, 77 కెనాళ్ల డిస్ట్రిబ్యూటరీలు పూర్తిగా దెబ్బతిని సాగుకు నీటి సరఫరాకు ఉన్న మార్గాలన్నీ మూసుకుపోయాయి. వివరాల్లోకి వెళితే.. పెగడపల్లి మండలంలో సాగుకు ఎస్సారెస్పీ నీరే ఆధారం. దాదాపు 21 గ్రామాల్లోని వేలాది ఎకరాలకు ఒకప్పుడు పుష్కలంగా నీరందేది. అయితే, ఇటీవలి కాలంలో కాలువలు పూడిక, పిచ్చి చెట్లతో నిండిపోయాయి. దీని కితోడు కాలువలకు అనేక చోట్ల డ్రాపులు, తూములు, బ్రిడ్జిలు కూలిపోవడంతో చుక్క నీరు కూడా దిగువకు వెళ్లడం లేదు. దీంతో రైతులు పూర్తిస్థాయి విస్తీర్ణంలో సాగు చేయలేకపోతున్నారు. కాలువలు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇలా అయితే తాము ఎవుసం చేసేదెలా..? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టిందని, చాలాచోట్ల బాగుచేసిందని, అలాగే ఇప్పుడూ చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- కేశవపట్నం వద్ద ఘటన • కొత్తగట్టులో విషాదం

పిట్టల మహేశ్;అరవిందాచారి (ఫైల్)

శంకరపట్నం, జూన్ 9: శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కొత్తగట్టు యువకులు దుర్మరణం చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన పిట్టల మహేశ్ (19), నర్సింగోజు అరవిందాచారి (17) ఆదివారం రాత్రి వ్యక్తిగత పనిపై కొత్తగట్టు నుంచి కేశవపట్నం వైపు బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో శ్రీలక్ష్మీ రైస్ మిల్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాద స్థలానికి ఎస్ఐ లక్ష్మారెడ్డి, ఏఎస్ఐ మల్లారెడ్డి, పోలీసు సిబ్బందితో వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు.